ఉత్తమ ఉపాధ్యాయులు వీరే...



కె.శశికళ సీతాఫల్‌మండి | బి.హేమమాలిని జామైఉస్మానియా | కె.శ్రీనివాస్ ముషీరాబాద్ | ఎస్.సుజిత నల్లకుంట | శివరంజని అడిక్‌మెట్ | పి.ప్రమీల ముషీరాబాద్ | కె.పుష్పలత ముషీరాబాద్ | ఫరహత్ బాను ముషీరాబాద్ | ఎన్.సుజాత సీతాఫల్‌మండి

ముషీరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి (టీచర్స్ డే) సందర్భంగా ప్రకటించే ఉత్తమ ఉపాధ్యాయులను హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ బుధవారం ప్రకటించింది. ముషీరాబాద్ జోన్‌లో ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు, మరో ఐదుగురు స్కూల్ గ్రేడ్ టీచర్లను మొత్తం 10మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు ముషీరాబాద్ మండల విద్యాశాఖ అధికారి చిరంజీవి తెలియజేశారు. టీచర్స్ డే సందర్భంగా గురువారం మధ్యాహ్నం 2గంటలకు కింగ్ కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారులు ముఖ్యఅతిథులుగా హాజరై ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేస్తారని తెలిపారు. ముషీరాబాద్ జోన్‌లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

- ఎస్.సుజిత స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం, జీహెచ్‌ఎస్ నల్లకుంట
- ఎన్.సుజాత, ఎస్ఏ స్కూల్ అసిస్టెంట్ గణితం, జీహెచ్‌ఎస్ సీతాఫల్‌మండి
- కె.శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్ గణితం, జీహెచ్‌ఎస్ ముషీరాబాద్
- బి.హేమమాలిని స్కూల్ అసిస్టెంట్ గణితం, జీహెచ్‌ఎస్ జామైఉస్మానియా
- కె.శశికళ స్కూల్ అసిస్టెంట్ తెలుగు, జీహెచ్‌ఎస్ సీతాఫల్‌మండి
- శివరంజని, ఎస్‌జీటీ, జీపీఎస్ అడిక్‌మెట్
- పి.ప్రమీల, ఎస్‌జీటీ, సెయింట్ పాయిస్ స్కూల్ ముషీరాబాద్
- కె.పుష్పలత, ఎస్‌జీటీ, జీపీఎస్ ముషీరాబాద్
- డి.శశికళ, ఎస్‌జీటీ, జీపీఎస్ సీతాఫల్‌మండి
- ఫరహత్‌బాను, ఎల్ఎఫ్ఎల్, హెచ్ఎం జీపీఎస్ ముషీరాబాద్

వైద్యుల రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలి

గవర్నర్‌ను కలిసిన నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ సభ్యులు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతి పత్రం అందజేస్తున్న నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ నేతలు

కవాడిగూడ: వైద్యులకు మెరుగైన భద్రత, కేంద్ర రక్షణ చట్టం అమలుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ ప్రతినిధులు బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ డా. సురేంద్రబాబు మాట్లాడుతూ... విద్యాసంస్థల్లో వైద్యులు, వైద్యారోగ్య సమస్య నిపుణుల భద్రతకు ఇటీవలి కాలంలో రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్ దారుణ హత్య, వైద్య వృత్తిలో ఉన్నవారిని రక్షించడానికి సమగ్ర చట్టం అమలు యొక్క అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కఠినమైన విజిటర్ పాస్ విధానాన్ని అమలు చేయడం, 24గంటల భద్రత పెంపొందించడం, ఆసుపత్రి ప్రాంగణంలో రాత్రి సమయంలో సాధారణ భద్రతా గస్తీని అమలు చేయాలంటూ అన్ని రాష్ట్రాలకు జారీ చేసిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని కోరారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను భలోపేతం చేయడం, రాష్ట్ర, కేంద్ర అధీనంలో పనిచేస్తున్న ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని అన్నారు. వైద్యులపై హింసాత్మక చర్యలకు పాల్పడిన నేరస్తులపై విచారణను వేగవంతం చేయడం కోసం ప్రత్యేక చట్టం రూపొందించాలన్నారు.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్



మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

కాచిగూడ: వరద బాధితులను తక్షణమే రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆదుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. బుధవారం నారాయణగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే తెలంగాణ ప్రాంతానికి రూ.2వేల కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.5వేల కోట్లు నిధులు విడుదల చేయాలన్నారు. ఈ వరదల్లో మృతి చెందిన మృతుల కుటుంబాలకు రూ.80 లక్షలు, గాయపడిన వారికి రూ.5లక్షల రూపాయలు చెల్లించాలని అన్నారు. పూర్తిగా నష్టపోయిన కుటుంబాలకు మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10లక్షలు, వ్యవసాయ కూలీలలకు రూ.2లక్షలు, పంట నష్టపోయిన రైతులకు రెండు లక్షలు, నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇళ్లు కూలిపోయిన వారికి ఉచితంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, వరద బాధితులకు అన్ని రకాల పన్నులు, ఫీజులు రద్దు చేయాలని కోరారు. బాధితులకు 50 కిలోల బియ్యం, ఐదు కేజీల పప్పు, నిత్యావసర వస్తువులు, వంటపాత్రలు, మంచినీరు, ఆహారం, బెడ్‌షీట్స్, బట్టలు, ఉచితంగా అందించాలని కోరారు. విద్యుత్‌ను పునరుద్ధరించాలని, మందులు ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో సిలివేరు వసంతరావు, బీరం సతీష్ కుమార్, గోలి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీనివాస్, జనార్దన్, అనురాధ

ముషీరాబాద్: ప్రభుత్వ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అసంఘటిత కార్మికుల డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ ఉభయ రాష్ట్ర కమిటీ నేతల డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఆర్.జనార్ధన్, ఉపాధ్యక్షులు జి.అనురాధ, అరుణ, పి.శివబాబులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ నెల 8 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాలలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 8న గోదావరి ఖని, 13న నిజామాబాద్, 19న ఖమ్మం, 20న గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 30వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

శుభాకాంక్షలు

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పి.శ్రీధర్‌చారి ఆలిండియా విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ ముషీరాబాద్ నియోజకవర్గం నూతన అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం విశ్వకర్మ సంఘం నాయకులు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రవిచారి, రాజేష్, వసంత్‌చారి, అభిషేక్ మాట్లాడుతూ.. శ్రీధర్‌చారి సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటారన్నారు. విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి శ్రీధర్‌చారి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

జీవిత మార్గాన్ని చూపేవారే నిజమైన గురువులు



ముదిగొండ శివప్రసాద్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

చిక్కడపల్లి: విద్యను బోధించడంతో పాటు జీవిత మార్గాన్ని చూపేవారే నిజమైన గురువులని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిగొండ శివప్రసాద్‌కి పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ... అధ్యాపక వృత్తి నుంచి దేశ రాష్ట్రపతి స్థాయికి చేరుకున్న మహోన్నత వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణ అని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో లంకా లక్ష్మీనారాయణ, అక్కిరాజు సుందర రామకృష్ణ, పేరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు జి.రాములు రచించిన లాల్ నీల్ స్ఫూర్తి ప్రదాతలు పుస్తకాన్ని తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లాల్‌నీల్ స్ఫూర్తి ప్రదాతల పుస్తకంలో అనేక మంది ప్రముఖులకు సంబంధించిన విషయాలను ప్రస్తావించడం జరిగిందన్నారు. నా చిన్నతనంలో కూడా ఓ వైపు మార్క్స్, మరో వైపు అంబేడ్కర్ వైపు నడిచానని గుర్తు చేశారు. అందుకు కారణం నా పేదరికం, నా బ్రాక్‌గ్రౌండే వారి వైపు నడిపించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ యాక్టు అమలులో తాను కూడా కీలక పాత్ర పోషించానని తెలిపారు. జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ.. చిన్నతనంలోనే కమ్యూనిస్టు భావాలతో ఎదిగానని అన్నారు. టీపీఎస్‌కే కన్వీనర్ భూపతివెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు ఎస్.వీరయ్య, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ప్రొఫెసర్ ననుమాస స్వామి, డాక్టర్ జిలకర శ్రీనివాస్, తెలంగాణ సాహితీ కార్యదర్శి కె.ఆనందచారి, బీఎల్ఎఫ్ చైర్మన్‌నల్లా సూర్యప్రకాష్ పాల్గొని ప్రసంగించారు.



నిర్లక్ష్యం..!

- క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం
- ఫిర్యాదులను పట్టించుకోని సిబ్బంది
- కవాడిగూడలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే..

కవాడిగూడ: అసలే వర్షాకాలం... పారిశుద్ధ్య లోపంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వర్షాకాలంతో వరద నీరు రోడ్లపై నిలిచిపోతోంది. దీంతో వర్షం నీరు రోడ్లపై నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెందడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుద్ధ్యం అటకెక్కింది. పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని తొలగించాలని ఫిర్యాదులు చేసినా జీహెచ్‌ఎంసీ సిబ్బంది పట్టించుకోటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కవాడిగూడ డివిజన్, ఇందిరాపార్కు ధర్నా చౌక్, కొత్త బజార్, బండమైసమ్మ నగర్ ప్రాంతాలలో ఈ దుస్థితి నెలకొంది. చాలా చోట్ల ప్రజలు రోడ్లపైన చెత్త వేస్తున్నారు.



ఇందిరాపార్కు ధర్నాచౌక్ రూ.5 భోజనం క్యాంటీన్ వద్ద అపరిశుభ్రం

పేరుకుపోయిన చెత్తను తొలగించాలి...

గతంలో జీహెచ్‌ఎంసీ అన్ని డివిజన్లను డస్ట్‌బిన్ ఫ్రీ డివిజన్లుగా చేసింది. కానీ ఇళ్లలోని చెత్తను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వకుండా కొంత మంది నేరుగా తెచ్చి ప్రభుత్వ స్థలాలు, ఖాళీ ప్రదేశాలలో పడేయడంతో సమస్య తీవ్రమవుతోంది. పలు ప్రాంతాల్లో చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోలు నిత్యం రాకపోవడంతో ఇందిరాపార్కు పరిసర ప్రాంతాలలో చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వారు, ఎన్‌టీఆర్ స్టేడియం, ధర్నా చౌక్‌లో రోడ్లపై చెత్తను పడేసి వెళ్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధికారులు నిత్యం పర్యవేక్షించాలి..



జీహెచ్‌ఎంసీ అధికారులు డివిజన్‌లో చెత్త తరలింపు విషయంలో చర్యలు తీసుకోవాలి. నిత్యం చెత్త డంపింగ్ ప్రదేశాలలో చెత్తను వేయకుండా పర్యవేక్షించాలి. కిందిస్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెత్త తరలింపు విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు.

– కార్పొరేటర్ రచనశ్రీ

రోగాలు బారిన పడుతున్నాం..



జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో దుర్గంధం నెలకొని రోగాల బారిన పడుతున్నాం. చెత్త తరలింపు విషయంపై అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేసినా వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదు. అధికారుల్లో మార్పు రాకుంటే జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తాం.

– ఎంసీ మహేందర్‌బాబు, బీజేపీ నేత

రేపు జాబ్ మేళా

కాచిగూడ: భారత్ సేవ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మణికొండలోని కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ అడప వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ అర్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.99593 63083లో సంప్రదించాలని కోరారు.

హుండీ ఆదాయం రూ.1,59,131

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధ ఆంజనేయస్వామి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.1,59,131 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు. దేవాదాయ శాఖ పరిశీలకులు సురేఖ పర్యవేక్షణలో భక్తులు, సిబ్బంది కానుకలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, వెంకటాద్రి, క్లర్క్ రాజన్, భక్తులు జానకిసుధాకర్, ప్రశాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన జీవీఆర్ విద్యార్థులు

కాచిగూడ: మేడ్చల్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీకి చెందిన 40 మంది విద్యార్థులు సత్తాచాటారు. కటా, కుమితి విభాగాలలో 27 బంగారు పతకాలు, 17 రజత పతకాలు, 22 కాంస్య పతకాలు సాధించి చాంపియన్‌షిప్ కప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ విజయలక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ డా. జీఎస్ గోపాల్‌రెడ్డి, అమృతరెడ్డి, గణ సంతోషిణిరెడ్డి, షైనీ, అవిజ్ఞ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

డా. ఎడ్ల రఘుపతిరెడ్డికి నివాళి

నల్లకుంట: రెడ్డి హాస్టల్ పూర్వ అధ్యక్షుడు దివంగత డా. ఎడ్ల రఘుపతిరెడ్డి ప్రథమ వర్థంతి బుధవారం నిర్వహించారు. హైటెక్ సిటీ యశోద ఆస్పత్రి ఆర్థోపెడిక్ డా. దీప్తి నందన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దీప్‌కరణ్ రెడ్డి, కాంగ్రెస్ నేత కాలేరు శ్రీనివాస్‌రావు, ఎడ్ల నరేందర్‌రెడ్డి తదితరులు రఘుపతిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అంబేడ్కర్ భవనం నిరుపయోగంగా ఉండటం సరికాదు

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- లోయర్ ట్యాంక్‌బండ్‌లోని భవన్‌లో ఆకస్మిక తనిఖీలు
- అధునాతన వసతులతో డిజిటల్ తరగతులను నిర్వహిస్తాం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం రెవెన్యూ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. అంబేడ్కర్ భవన్‌లో మూసేసిన స్టడీ హాల్, భవన పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అంబేడ్కర్ భవన్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం అధునాతన వసతులతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. నగరం నడిబొడ్డున విశాలమైన భవనం నిరుపయోగంగా ఉండటం సరికాదన్నారు. కొన్నేళ్లుగా అంబేడ్కర్ భవన్ నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా డిజిటల్ తరగతులను అందుబాటులోకి తెస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ తహసీల్దార్ కొర్రా రాణాప్రతాప్‌సింగ్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మారుతీనగర్ బస్తీవాసులకు పక్కా గృహాలు నిర్మించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మారుతీనగర్, అన్నానగర్ బస్తీవాసులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మారుతీనగర్, అన్నానగర్ బస్తీల్లో నివసిస్తున్న పేద, దళిత, బలహీన వర్గాలకు చెందిన వారికి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ చెట్టుకింద శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ డి.స ంధ్యారాణికి సమస్యను వివరించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 18 సంవత్సరాలుగా 20 కుటుంబాలు నివసిస్తున్నాయని వారికి పక్కా గృహాలు లేక కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సోషియో ఎకానామిక్ సర్వే నిర్వహించారని బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండాపోయిందన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా పేద, దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బస్తీ సులు మంజుల, బాలమణి, బాలనర్సమ్మ, దప్పు లక్ష్మి, గౌసియా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి కార్పొరేటర్ పావని వినతి



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అభివృద్ధికి నిధులను కేటాయించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని బుధవారం కార్పొరేటర్ పావని వినతి పత్రం సమర్పించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సూచనల మేరకు వినతి పత్రాన్ని అందజేశామని ఆమె తెలిపారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి డివిజన్ అభివృద్ధికి నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు

అంబర్‌పేట: గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఈనెల 7వ తేదీన ప్రారంభమై 17వ తేదీన నిమజ్జనంతో ముగుస్తాయని అంబర్‌పేట నియోజకవర్గ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) కన్వీనర్ ఆనంద్‌గౌడ్ తెలిపారు. ఈసారి ఉత్సవాలలో ముందుగా తమ పేరు నమోదు చేసుకున్న మండప నిర్వాహకులకు అంబర్‌పేట బీజీయూఎస్ తరఫున 2కిలోల లడ్డును అందజేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా పూజల అనంతరం మహిళా భక్తులకు తులసీ మొక్కలను అందజేస్తామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం మండపం ముందు ముగ్గులు వేసే మహిళలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. నిమజ్జనం రోజే నిజాం చెర నుంచి తెలంగాణకు విముక్తి కలిగిన రోజుకు గుర్తుగా నిర్వాహకులు తమ వాహనానికి జాతీయ జెండాను కట్టి వినాయక సాగర్ వైపు నిమజ్జనానికి తీసుకెళ్లాలని కోరారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ (టీబీఎస్ఎస్) ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కె. సురేష్‌చందర్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఓయూ సురభారతి సమితి హాల్‌లో సాయంత్రం 4గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ముఖ్యఅతిథిగా శాసన మండలి సభ్యురాలు సురభి వాణీదేవి, విశిష్ట అతిథులుగా ఓయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వేముగంటి కిషన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత, ప్రవచకుడు డాక్టర్ జి.శివప్రసాద్ హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు పురస్కారాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట వేయండి

నల్లకుంట: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. జలమండలి అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలన్నారు. అప్పుడే డ్రైనేజీలు పొంగిపొర్లి కాలనీ రోడ్లపై ప్రవహించకుండా అడ్డుకట్ట వేయాలని కోరారు. స్థానికుల ఫిర్యాదు మేరకు టీఆర్టీకాలనీలో జలమండలి అధికారులతో కలిసి పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి నర్సింగ్‌రావు, జలమండలి శివం సెక్షన్ మేనేజర్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాన్ని రికార్డ్ స్థాయిలో నమోదు చేయాలి

కాచిగూడ: రికార్డ్ స్థాయిలో బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేయించాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. బీజేపీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరితో సభ్యత్వాన్ని చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతల రాంచంద్రారెడ్డి, ఆనంద్‌గౌడ్, కృష్ణ గౌడ్, అనంతలక్ష్మి, రాహుల్‌చంద్ర, సి.వినోద్‌యాదవ్, నానాజీ, ప్రసాద్, యశ్వంత్, కేశబోయిన శ్రీధర్, సుప్రియగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మేకల ముత్తన్న సేవలు మరువలేనివి

జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె. రాములు



కవాడిగూడ: షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ జాతీయ గౌరవ అధ్యక్షుడు దివంగత ముత్తన్న ఆశయ సాధనకు దళితులంతా పాటుపడాలని జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె. రాములు పిలుపునిచ్చారు. దళితులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని పోరాడిన మహోన్నత వ్యక్తి మేకల ముత్తన్న అని ఆయన కొనియాడారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో మేకల ముత్తన్న సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముత్తన్న చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డి. సుదర్శన్‌బాబు, జాతీయ ముఖ్య ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, ఏపీ అధ్యక్షుడు చెన్నకేశవరావులు, జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ రుద్రారం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టు శ్యామ్ మృతి బీజేపీకి తీరని లోటు

ముషీరాబాద్: ముషీరాబాద్ బీజేపీ సీనియర్ నేత మెట్టు శ్యామ్ మృతి బీజేపీకి తీరని లోటని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ బోయబస్తీలోని మెట్టు శ్యామ్ నివాసానికి ఆయన వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మెట్టు శ్యామ్ బీజేపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, నాయకులు పూసరాజు, రామేష్‌రాం, వాసు, శ్రీనివాస్‌యాదవ్, బిజ్జి కనకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా, ట్రాన్స్‌జెండర్ సంఘాల జేఏసీ నిరసన

కవాడిగూడ: కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ హత్యాచార నేరస్తులను రక్షిస్తున్న కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను తొలగించాలని బుధవారం రాత్రి హైదరాబాద్ మహిళా, ట్రాన్స్‌జెండర్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళల రక్షణ కోసం పోరాడదాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ఝాన్సీ, సంధ్య, అనసూయ, సజయ, జ్యోతి, కృష్ణకుమారి, శ్రీదేవి, వరలక్ష్మి, దీప తదితరులు పాల్గొన్నారు.

